క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట, బ్రాహ్మణపల్లి, ఆరేడ్, వెల్గనూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం సెక్టార్ అధికారి సంజీవ్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను తనిఖీ చేశారు. ఆయన వెంట స్థానిక ఎన్నికల అసిస్టెంట్ అధికారి అంజయ్య తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపేటలో..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల 208, 210 పోలింగ్ కేంద్రాలను సోమవారం స్థానిక ఎంపీడీవో రఘు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో చేపట్టిన టాయ్‌లెట్ల నిర్మాణాలను తొందరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్ ఉన్నారు.

వాహనాల తనిఖీ



దోమకొండ: మండల కేంద్రంతో పాటు భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. వాహనాలు, ఆటోలు, ఆర్టీసీ బస్సులను తనిఖీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తనిఖీలు చేపట్టామన్నారు. దోమకొండ- కామారెడ్డి రహదారిలో సైతం వాహనలు తనిఖీ చేసినట్లు వివరించారు. మద్యం, డబ్బు తరలిస్తే కేసులు నమోదు అవుతాయన్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రావణ్ కుమార్, కానిస్టేబుళ్లు వహిద్, జాకబ్, మహేష్, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: సోమవారం రాజంపేట గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున రూ. 50 వేలకు మించి తీసుకెళ్లరాదని, అక్రమంగా మద్యం తరలిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన కొర్ర వసూరాంకు సెల్‌ఫోన్‌ను ఎస్సై గణేష్ సోమవారం అందించారు. వసూరాం తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ గుర్తించి బాధితుడికి అందించినట్లు ఎస్సై తెలిపారు.

'తొలిమెట్టు' ప్రారంభం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ సోమవారం తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు చదువులో వెనకబడిన విద్యార్థులకు బేసిక్ శిక్షణ అందించేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారు. చదువులో వెనకబడిన వారికి ప్రత్యేకంగా బేసిక్ బోధించనున్నట్లు వివరించారు. అధ్యాపకులు ప్రభాకర్, సిద్దు, జయప్రకాష్, కృష్ణ ప్రసాద్ తదితరులున్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ జట్టుకు పోతంగల్ బాలికల ఎంపిక



గాంధారి(ఎల్లారెడ్డి): పోతంగల్ కలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు కబడ్డీలో జిల్లా స్థాయికి జట్టుకు ఎంపికైనట్లు పీఈటీ లక్ష్మణ్ తెలిపారు. అండర్-17 విభాగంలో పాఠశాలకు చెందిన ఇగ్రత్, సంధ్య, సౌమ్య, ప్రణతి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు అభినందించారు.

కాళ్లు మొక్కి ఓట్లు అడుగుతా

- ప్రజల అభిప్రాయం మేరకే నామినేషన్ దాఖలు
- కాంగ్రెస్ నేత కాసుల బాల్‌రాజ్



బాన్సువాడలో నామినేషన్ వేసి వస్తున్న బాల్‌రాజ్

బాన్సువాడ: నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్క ఓటరు కాళ్ల మొక్కుతూ ఓట్లు అడుగుతానని, ప్రజాభిప్రాయం మేరకే నామినేషన్ వేశానని కాంగ్రెస్ నేత కాసుల బాల్‌రాజ్ అన్నారు. సోమవారం బాన్సువాడలో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మాట్లాడారు. ఇన్ని రోజులు కమ్యూనిస్టు పార్టీలో పొత్తుపై కొంత జాప్యం జరిగిందని, సోమవారం మంచి రోజు కావడంతో నామినేషన్ వేశానని, మళ్లీ బి-ఫారంతో ఈ నెల 10న కార్యకర్తలు, నాయకులతో వచ్చి నామినేషన్ వేస్తానని అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉన్నప్పటికి అతి తక్కువ మెజార్టీతో ఓడిపోయానని గుర్తు చేశారు. కొంత మంది ప్రజలను భయపెట్టి పార్టీలో చేర్చుకుంటున్నారని, ప్రజలు తమ వైపే ఉన్నారని అన్నారు. ఎన్నికల్లో తాను ఓడిపోయినప్పటికి ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేశానని అన్నారు. నీతి నిజాయితీ గురించి కొందరు మాట్లాడుతున్నారని, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తనకున్న ఆస్తులు అమ్మి ఇల్లు కట్టుకున్నానని, ఎవరిని మోసం చేసి, కబ్జాలు చేసి సంపాదించలేదని అన్నారు. ఏదైనా తప్పు చేస్తే తన ఆస్తులు, ఇతరుల ఆస్తులపై అంబేడ్కర్ చౌరస్తాలో బహిరంగ చర్చ పెడదామని అన్నారు. గతంలో కూడా మావోయిస్టులు కొట్టి చనిపోయాడని పడేసి వెళ్తే బతికి వచ్చానని, చావో, రేవో ఇక ప్రజలపైనే భారం వేస్తున్నానని అన్నారు. ఎన్నికల్లో గెలిచాక అందరి చిట్టాలు బయట పెడతామని, బాన్సువాడను జిల్లా చేయాలని 107 రోజుల నిరాహార దీక్షలు చేశామని అన్నారు. నాయకులు ఖలేక్, ఉద్దెర హన్మండ్లు, శేఖర్‌రెడ్డి, బోయిని శంకర్, అజీం, రూప్‌సింగ్, మంత్రి గణేష్, కాసుల రోహిత్, నార్ల రఘు, వెంకట్‌రాంరెడ్డి తదితరులున్నారు.

రంగులు మారుతున్న రాజకీయం



మొన్న మదన్‌మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లోకి..



నిన్న మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి చేరిన అల్తాఫ్

- మొన్న కాంగ్రెస్‌లోకి.. నిన్న మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి
- మండల కో–ఆప్షన్ సభ్యుడు తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలో రాజకీయం రంగులు మారుతోంది. స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారుతూ ఎమ్మెల్యే అభ్యర్థులకు గుబులు పుట్టిస్తున్నారు. బేరసారాలకు వెనుకాడటం లేదు. మొన్నటి వరకు ఎమ్మెల్యే జాజాల సురేందర్ వెన్నంటి ఉన్న మండల కేంద్రానికి చెందిన మండల కో-ఆప్షన్ సభ్యుడు అల్తాఫ్ తనకు బీఆర్‌ఎస్‌లో ఎలాంటి గుర్తింపు ఇవ్వడం లేదని, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మదన్ మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు అల్తాఫ్‌కు నచ్చజెప్పి సోమవారం మళ్లీ తిరిగి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. మొన్న ఒక పార్టీ, నిన్న ఒక పార్టీలో చేరడాన్ని చూస్తున్న విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కామారెడ్డిలో దొరల ఆటలు సాగవు



ఇస్సానగర్‌లో వెంకట రమణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న గ్రామస్తులు

- కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణా రెడ్డి

బీబీపేట: కామారెడ్డిలో దొరల ఆటలు సాగవని, ప్రజలందరు బీజేపీ వైపు ఉన్నారని వారు మార్పును కోరుతున్నారని కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం ఇస్సానగర్, మాందాపూర్, మల్కాపూర్ గ్రామాల్లో పలువురు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ మళ్లీ వస్తే ఉన్నది కూడా దోచుకుంటారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నక్క రవీందర్, అల్లం ప్రవీణ్, సంతోష్ గౌడ్, దేవరాజ్ గౌడ్, పోసు శివ, రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్థాయికి తగ్గట్లు బోధించాలి



బాన్సువాడ రూరల్: విద్యార్థుల స్థాయికి తగ్గట్లు ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియలు ఉపయోగించాలని కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ సూచించారు. సోమవారం బోర్లం జెడ్పీ హైస్కూల్‌లో కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు నిరంతరం బోధనాభ్యసన సామర్థ్యాలను మెరుగు పర్చుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే పఠన, రాత, అవగాహన సామర్థ్యాలు మెరుగుపడేలా చొరవ తీసుకోవాలన్నారు. అలాగే విద్యార్థుల హాజరు శాతంపై దృష్టి సారించాలని సూచించారు. సీఆర్పీ జ్యోతి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం జాగృతి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి పెద్దపీట

- శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్



మాట్లాడుతున్న బండ ప్రకాష్

కామారెడ్డి క్రైం: ముదిరాజ్ కులస్తులు రాజకీయంగా ఎదిగేందుకు కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. కామారెడ్డిలోని శుభం ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. గతంలో ఏ రాజకీయ పార్టీ ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. కానీ కేసీఆర్, కేటీఆర్‌లు ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కామారెడ్డిలో కేసీఆర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాబోయే రోజుల్లో కార్పొరేషన్ ఛైర్మన్, ఎమ్మెల్సీలను ముదిరాజ్‌లకు కేటాయిస్తారని అన్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పున్న రాజేశ్వర్, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు డిపాజిట్లు దక్కవు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్



మాట్లాడుతున్న బాల్క సుమన్

కామారెడ్డి క్రైం: ప్రతిపక్షాలకు కామారెడ్డిలో డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సోమవారం కామారెడ్డిలోని సత్య గార్డెన్‌లో నియోజకవర్గ యువత ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ ఎలా అభివృద్ధి జరిగిందో మనం చూశామన్నారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి గెలుపొందిన తర్వాత ఇక్కడి ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మనందరం ఉద్యమ సమయంలో కష్టపడుతుంటే రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడి చెప్పులు మోస్తుండే వాడని విమర్శించారు. టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ గెల్లు శ్రీనివాస్, మైనింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ క్రిశాంక్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు గంప శశాంక్ పాల్గొన్నారు.

ఈ విద్యాసంవత్సరం నుంచే ఎన్‌సీసీ అమలు



బాన్సువాడ రూరల్: ఈ విద్యా సంవత్సరం నుంచే శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎసీసీ యూనిట్ ప్రారంభిస్తామని నిజామాబాద్ ఎన్‌సీసీ అధికారి కరుప్పయ్య తెలిపారు. సోమవారం ఆయన కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందూరు గంగాధర్‌తో కలిసి ప్రాంగణాన్ని, వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీటీవో రాథోడ్ కృష్ణ, తారాచంద్, గోపాల్, బాలరాజు, యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి

- డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



బాన్సువాడలో ప్రచారం చేస్తున్న డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ : బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికే దక్కిందని, వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మరోసారి ఆయనను గెలిపించాలని డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగమేశ్వర కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారని అన్నారు. రూ.కోట్లాది నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీ వచ్చేలా ఓట్లు వేయాలని సూచించారు. రైతులకు రూ.16 వేల రైతు బంధు, ప్రతి పేదవాడికి రూ. 5 లక్షల కేసీఆర్ బీమా వస్తుందని అన్నారు. రూ. 400కే సిలిండర్ అందజేస్తామని అన్నారు. రైతులతో మాట్లాడారు. ధాన్యం డబ్బులు ఎన్ని రోజుల్లో వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్, వైస్ ఛైర్మన్ జుబేర్, నాయకులు అంజిరెడ్డి, నర్సగౌండ, పాత బాలకృష్ణ, కృష్ణారెడ్డి, అనిత, ప్రతిమా, కనుకుట్ల అనసూయ, కుర్మ సరిత, నాటకారి రాజేష్, కనుకుట్ల రాజు, వడ్ల శివ, సుదర్శన్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన పలువురు యువకులు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు సోమవారం డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి గులాబీ కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి, నేతలు దేవారం నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



బీజేపీలో చేరినవారికి కండువాలను కప్పుతున్న సుభాష్‌రెడ్డి

- బీజేపీ ఎల్లారెడ్డి నియోజకవర్గ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రస్తుత ఎన్నికల సమరంలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సూచించారు. మాల్తుమ్మెద, వదల్‌పర్తి, ధర్మారెడ్డి గ్రామాలకు చెందిన పలువురు యువకులు సోమవారం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాయకులెవరైనా కార్యకర్తలపైనే ఆధారపడాల్సి ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త బీజేపీ కోసం కష్టపడి పని చేయాలని చెప్పారు. బీజేపీ మండలాధ్యక్షుడు హన్మాండ్లు, నాయకులు ధనుంజయ్, దుర్గేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి పలువురి చేరిక

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం బీజేపీలో చేరారు. వీరికి సుభాష్‌రెడ్డి పార్టీ కండువాలను కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద, లింగంపేట మండలంలోని మోతె గ్రామాలకు చెందిన పలువురు పార్టీలో చేరారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న గోవా బీజేపీ నేతలు

ఎల్లారెడ్డి: బీజేపీ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గోవా బీజేపీ రాష్ట్ర నాయకులు సుభాష్ మాలిక్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బాణాల లక్ష్మారెడ్డి, సుభాష్ రెడ్డి, ఎస్ఎన్ రెడ్డి, దేవేందర్, తదితరులున్నారు.

కుల సంఘాల సమ్మేళనాలతో మోసం



కామారెడ్డి టౌన్: ఆయా రాజకీయ పార్టీలు కుల సంఘాల సమ్మేళనాలతో మోసం చేస్తున్నారని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. 60 శాతం ఉన్న బీసీలకు 20 శాతం సీట్లు మాత్రమే కేటాయించిన పార్టీలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దోళ్ల మహేష్, ఎల్లారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడు దయాకర్, నాయకులు నరేష్, ప్రవీణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతు పలికిన కులసంఘాలు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ నియోజవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా మరోసారి పోటీ చేయనున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డికి నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామానికి చెందిన పద్మశాలి కులస్తులు మద్దతు పలికారు. సోమవారం కులసంఘం జిల్లా కార్యదర్శి కోట గిర్మయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో వచ్చిన వీరంతా కులసంఘం చేసిన ఏకగ్రీవ తీర్మాన పత్రాలను అందజేశారు.

కార్మిక నేతను ఎమ్మెల్యేగా గెలిపించాలి

- బీఎల్‌ఎఫ్ అభ్యర్థి సిద్ధరాములు



ప్రచారం చేస్తున్న బీఎల్‌ఎఫ్ కార్యకర్తలు

దోమకొండ: తాగుబోతుల రాజ్యం వద్దని, పేదలను కార్మికులను పట్టించుకునే నాయకులు కావాలని బీఎల్‌ఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి సిరిగాద సిద్ధ రాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన పార్టీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ యువకులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఊరికో బెల్ట్‌షాపు ఇచ్చారన్నారు. కార్మిక నాయకులను ఎన్నుకుంటే ప్రజల పక్షాన పోరాటాలు చేస్తారన్నారు. బీడీ కార్మిక నాయకుడిగా ప్రజలు, కార్మికుల పక్షాన పోరాటాలు చేశామన్నారు. అసెంబ్లీలో బీసీ, ఎస్సీ, ఎస్టీల పక్షాన ఎమ్మెల్యేలుగా ఉండేలా ప్రజలు తీర్పు ఇవ్వాలన్నారు. నాయకులు సిరిగాద సబిత, అంజనేయులు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సస్పెండైన ఎంపీటీసీ అనుచరుల ధర్నా



పిట్లం(జుక్కల్): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో చిన్నకొడప్‌గల్ ఎంపీటీసీ-2 వెంకట్‌రెడ్డిను సస్పెండ్ చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి రమేష్ ఆదివారం రాత్రి ప్రకటించారు. దీంతో ఆయన అనుచరులు సోమవారం గ్రామంలోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి బీఆర్‌ఎస్ పార్టీ కండువాలు దహనం చేసి నిరసన తెలిపారు.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎ మ్మెల్యే ఎప్పుడైతే తనలాంటి కార్యకర్తను పోగొట్టుకున్నారో ఆరోజే హన్మంత్ సింధే ఎమ్మెల్యేగా ఓడిపోయారని అన్నారు.

కార్యకర్తలు శ్రమించాలి



భిక్కనూరు: కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్‌కు భారీ మెజార్టీ కట్టబెట్టేందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలని ఫుడ్ కమిషన్ మాజీ ఛైర్మన్ కొమ్ముల తిర్మల్ రెడ్డి అన్నారు. సోమవారం లక్ష్మీదేవునిపల్లి గ్రామ యువకులు 35 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి తిర్మల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కండువాలు కప్పి స్వాగతించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్టీ కోసం పనిచేసేవారికి బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఛైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడి మృతి

దోమకొండ: దోమకొండ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మర్రి లింగం(63)సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన హైద్రాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మర్రి లింగంకు భార్య జ్ఞానేశ్వరి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో బీఆర్‌ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కామారెడ్డికి తరలిన ముదిరాజులు

భిక్కనూరు: జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో బీఆర్‌ఎస్ నిర్వహించిన ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనానికి భిక్కనూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముదిరాజు కులస్తులు సోమవారం బయలుదేరి వెళ్లారు.

రైతులకు అవగాహన సదస్సు

భిక్కనూరు: అంతంపల్లిలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సిద్దరాములు, భూపతిలు సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మధుమోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్నేహ, విండో ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోహ్లి జన్మదిన వేడుకలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సోమర్యాగడి తండాలో ఆదివారం విరాట్ కోహ్లి జన్మదిన వేడుకలను నిర్వహించారు. జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. జన్మదినం రోజున 49వ సెంచరీ సాధించి విజయం సాధించినందుకు కోహ్లీకి అభినందనలు తెలిపారు.

'విద్యార్థుల ప్రగతి కోసం కృషి చేయాలి'



నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రగతి కోసం ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని ఎంఈవో దేవిసింగ్ అన్నారు. సోమవారం నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదవడం, రాయడంలో ముందుండాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎస్ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో నోడల్ అధికారి అమర్‌సింగ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.